నవతరం బాలలకు నవోదయ స్వాగతం

మేటి విద్యను పొందడానికి లక్షల్లో ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రతిభ ఉంటే చాలు- అత్యుత్తమ విద్యా సంస్థల్లో చదువుకోవచ్చు. ఒత్తిడి లేని విద్యతోపాటు ఆట పాటలకు ఢోకా లేకుండా..వికాసానికే ప్రాధాన్యముంటుంది. ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువు, వసతి, భోజనం అంతా ఉచితంగా లభిస్తుంది. ఈ అవకాశం నవోదయ విద్యాలయాల్లో పొందవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం (2023-24) ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రకటన వెలువడింది!

దేశంలో తమిళనాడు తప్ప ఇంచుమించు జిల్లాకొకటి చొప్పున 649 నవోదయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటిలో ఏపీలో 15 (2 కొత్తవి), తెలంగాణలో 9 ఉన్నాయి. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం లభిస్తుంది. 2022-2023 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న వాళ్లు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ (జేఎన్‌వీఎస్‌టీ) రాసుకోవచ్చు.

అభ్యర్థులు ప్రవేశం కోరే జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్నవారై ఉండాలి. విద్యార్థులు ఒకసారి మాత్రమే పరీక్ష రాయడానికి అర్హులు. 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాలవారితోనే నింపుతారు. ఈ కోటాలో సీటు ఆశించే విద్యార్థులు 3,4,5 తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో లేదా గుర్తింపు పొందిన ఇతర పాఠశాలల్లో చదవాలి. అలాగే మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయించారు. ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు కొన్ని సీట్లు ఉన్నాయి. బాలబాలికలకు విడిగా వసతి సౌకర్యం కల్పిస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్ సౌకర్యాలు ఉన్నాయి.

పరీక్ష విధానం

ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లిష్.. ఇలా కోరుకున్న మాధ్యమంలో పరీక్ష రాసుకోవచ్చు. మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. మూడు సెక్షన్ల నుంచి 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. వీటిని 2 గంటల్లో పూర్తిచేయాలి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. సెక్షన్-1 మెంటల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు. వీటిని గంటలో పూర్తి చేయాలి. సెక్షన్-2 అరిథ్‌మెటిక్ 20 ప్రశ్నలు. వీటికి అర గంట కేటాయించారు. సెక్షన్-3 లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు. 30 నిమిషాల వ్యవధి. సమాధానాలు ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి. బ్లాక్ లేదా బ్లూ పెన్ను ఉపయోగించి సరైన ఆప్షన్ సూచించే గడిని సంపూర్ణంగా దిద్దాలి. పరీక్షలో అర్హత సాధించడానికి ప్రతి సెక్షన్‌లోనూ కనీస మార్కులు పొందాలి.

ఎంపికైతే...

బాలికలు, ఎస్సీ, ఎస్టీలు, అల్పాదాయ వర్గాలవారు ఆరో తరగతి నుంచి +2 వరకు ఉచితంగా చదువుతోపాటు వసతి, భోజనం పొందవచ్చు. మిగిలినవారు తొమ్మిదో తరగతి నుంచి నెలకు రూ.600 చెల్లిస్తే సరిపోతుంది. ఉన్నత బోధన ప్రమాణాలు నవోదయ విద్యాలయాల సొంతం. ఎనిమిదో తరగతి వరకు బోధన మాతృ/ప్రాంతీయ భాషలోనే కొనసాగిస్తారు. అనంతరం మ్యాథ్స్, సైన్స్ ఇంగ్లిష్‌లోనూ, సోషల్ హిందీలోనూ బోధిస్తారు. సీబీఎస్ఈ సిలబస్ అనుసరిస్తారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఉంటుంది. వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తారు. ఇక్కడ విద్యార్థులకు నీట్, ఐఐటీ - జేఈఈ.. తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించేలా శిక్షణ అందిస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పై తరగతులను ఇతర రాష్ట్రాల్లోని నవోదయ విద్యాలయాల్లోనూ చదువుకోవచ్చు.

ప్రశ్నలు ఇలా..

మెంటల్ ఎబిలిటీ పరీక్షలో.. చిత్రాలు, రేఖలు, బొమ్మలపై ప్రశ్నలు వస్తాయి. ఈ సెక్షన్‌లో 10 భాగాలు ఉంటాయి. ఒక్కో దాంట్లో నాలుగేసి చొప్పున ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నల్లో కొన్ని బొమ్మలు ఇచ్చి వాటిలో భిన్నమైనది గుర్తించమనడం, ఒక అసంపూర్ణ చిత్రం లేదా గ్రాఫ్ ఇచ్చి అది సంపూర్ణం కావడానికి ఇచ్చిన ఆప్షన్లలో ఏది సరిపోతుందో పోల్చమనడం, చిత్రాలు/ బొమ్మల క్రమాన్ని ఇచ్చి తర్వాత వచ్చే దాన్ని తెలుసుకోమనడం.. ఇలా ప్రశ్నలు వస్తాయి. అరిథ్‌మెటిక్ పరీక్షలో అంకెలు, కసాగు, గసాభా, వడ్డీలు, దత్తాంశాలు, భిన్నాలు, లాభనష్టాలు, నాలుగంకెల్లో ఉండే కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు...మొదలైన ప్రశ్నలు ఉంటాయి. లాంగ్వేజ్ టెస్టులో పాసేజ్ ఇచ్చి ప్రశ్నలకు సమాధానం రాయమంటారు. విద్యార్థులు పాసేజ్ అర్థం చేసుకున్నారో లేదో తెలుసుకునేలా ఈ ప్రశ్నలు వస్తాయి. ప్రతి పాసేజ్ కింద ఐదేసి ప్రశ్నలు చొప్పున 4 పాసేజ్‌లుంటాయి.

అర్హత: 2022–2023 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండాలి. గతంలో పూర్తిచేసుకున్నవారు అనర్హులు.
వయసు: మే 1, 2011 – ఏప్రిల్ 30, 2013 మధ్య జన్మించాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 31
పరీక్ష తేదీ: ఏప్రిల్ 29 **వెబ్‌సైట్:** https://navodaya.gov.in

ఇష్టపడి చదివితే చాలు!

ఉస్మానియా పీజీ
జెనెటిక్స్ టాపర్ విష్ణువచన

జెనెటిక్స్.. ఒక అద్భుతమైన సబ్జెక్టు. జీవుల మూలాలను, అనువంశికతను అధ్యయనం చేసే సబ్జెక్టు ఇది. తెలంగాణలో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు ఎం.ఎన్.ఆర్. కాలేజీ, షాదన్ కాలేజీల్లో మాత్రమే ఈ సబ్జెక్టు ఉంది. ఉస్మానియాలో ఎమ్మెస్సీ జెనెటిక్స్ చదివిన మురపాక విష్ణువచన యూనివర్సిటీలో, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఈ విజయం వెనుక సాధన గురించి తన మాటల్లోనే..

మా తల్లిదండ్రులు వెంకటరమణ, జయశ్రీ. నాన్న జర్నలిస్టు. స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోట. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. నేను ఇక్కడే పుట్టి పెరిగా. డిగ్రీ కోఠీ విమెన్స్ కాలేజీ, పీజీ ఉస్మానియా క్యాంపస్‌లో చేశాను. ఎమ్మెస్సీలో ఫస్ట్ ర్యాంక్ రావడం వల్ల 'ఇన్‌స్పైర్' ఫెలోషిప్ వస్తుందని భావిస్తున్నా. పీహెచ్‌డీ చేయాలన్నది నా కోరిక.

ఏదైనా సబ్జెక్టులో లేదా కోర్సులో టాపర్ కావాలంటే 'రోజూ 10 గంటలకు పైగా చదవాలి.. మంచి కోచింగ్ తీసుకోవాలి.. రేయింబవళ్లు కష్టపడాలి' అనుకుంటారు చాలామంది. కానీ అంతకంటే ముఖ్యంగా సబ్జెక్టును ఇష్టపడి చదివితే పెద్దగా కష్టపడకుండానే అవగాహన పెరుగుతుందని నా ఉద్దేశం.

ముఖ్యంగా సైన్స్ సబ్జెక్టు కేవలం చదివితే వచ్చేది కాదు. అధ్యయనం చేయడానికి ప్రయత్నించాలి. అప్పుడే మనం అర్థం చేసుకోగలం. ముందుగా సబ్జెక్టు మీద ఆసక్తి ఉంటే చాలు.. అవగాహన చేసుకోవడం సులభం అవుతుంది. జెనెటిక్స్ వంటి సబ్జెక్టు చదువుతున్నపుడు బేసిక్స్ బాగా వచ్చి ఉండాలి. ప్రతి జీవిలోనూ కణాలు ఉంటాయి. వాటిలో ఉండే జన్యువుల మీద అధ్యయనం చేయడమే జెనెటిక్స్ అంటే. విభిన్నమైన లక్షణాలు తల్లిదండ్రుల నుంచి వారి సంతతికి చేరే ప్రక్రియ- 'అనువంశికత'కు జన్యువులే కారణం. ఇంటర్‌లో ఈ విషయాలు చదివాక జన్యువు గురించి, దాని పని తీరు గురించి మరింత లోతుగా తెలుసుకోవాలనే ఆసక్తి ఏర్పడింది. దీంతో హైదరాబాద్‌లోని కోఠీ ఉమెన్స్ కాలేజీలో చేరి బీఎస్సీ జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ చేశాను. బీఎస్సీలో చదివిన సబ్జెక్టే కనుక ఎమ్మెస్సీలో జెనెటిక్స్ చదవడం సులభం అయ్యింది. నేను ఎక్కడా ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు కానీ నాకు సబ్జెక్టుపై బాగా ఆసక్తి ఉంది కనుక పుస్తకాలు చదవడం కన్నా ఆ సబ్జెక్టు గురించి ఎక్కువగా ఆలోచించేదానిని. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేయడం వల్ల కాన్సెప్ట్ బాగా అర్థం అయింది. డీటెయిల్డ్ నోట్స్ తయారు చేసుకున్నాను. ఆ నోట్స్‌ను ఎగ్జామ్ ముందు ఒక్కసారి చదివితే సరిపోయింది. ఆ తర్వాత జెనెటిక్స్, బయోటెక్నాలజీ, మాలిక్యులర్ బయాలజీ వంటి సబ్జెక్టులను టెక్స్ట్‌బుక్స్‌లో చదివాను. విదేశీ, స్వదేశీ రచయితలు రాసిన పాఠ్యపుస్తకాలన్నిటినీ రెండుసార్లు అయినా చదివి ఉంటాను. ప్రొఫెసర్లు పాఠాలు చెప్పేటప్పుడే శ్రద్ధగా విని అర్థం చేసుకుంటే సగం సబ్జెక్టు వచ్చేసినట్లే. ముఖ్యమైన పాయింట్స్ నోట్స్ రాసుకోవడం.. డౌట్స్ వస్తే ప్రొఫెసర్లతో చర్చించి నివృత్తి చేసుకోవడం వల్ల పరీక్ష సమయంలో సందేహాలేవీ రాలేదు. 8.75 సీజీపీఏతో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోగలిగాను.

ఇంటర్నెట్‌లో శోధించి నేను రాసుకున్న నోట్స్‌లో దాదాపుగా మా సబ్జెక్టు సమాచారం అంతా ఉంటుంది. మా క్లాస్‌మేట్స్ చాలామంది, మా జూనియర్స్ కూడా నా బుక్స్ జిరాక్స్ తీసుకుని చదువుకోవడం నాకెంతో ఆనందం కలిగించే అంశం!

సైన్స్ సబ్జెక్టు కేవలం చదివితే వచ్చేది కాదు. అధ్యయనం చేయడానికి ప్రయత్నించాలి. అప్పుడే అర్థం చేసుకోగలం. ముందుగా సబ్జెక్టు మీద ఆసక్తి ఉంటే అవగాహన చేసుకోవడం సులభం అవుతుంది.

బోధన, పరిశోధనలకు రహదారి.. నెట్!

బోధనలో మేటి గుర్తింపు, పరిశోధనల్లో పాగా వేయడానికి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు (నెట్) ప్రామాణికం. ఈ పరీక్షలో లెక్చరర్‌షిప్‌లో అర్హత సాధించినవారు విద్యా సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడవచ్చు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు ఎంపికైనవారు ప్రతి నెలా స్టైపెండ్ పొందుతూ పీహెచ్‌డీ పూర్తిచేసుకోవచ్చు. కొన్ని ప్రభుత్వ సంస్థలు నెట్ స్కోరుతో ఉన్నత స్థాయి ఉద్యోగాలూ అందిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) తరఫున నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏడాదికి రెండు సార్లు ఈ పరీక్షను నిర్వహిస్తోంది. ఇటీవలే ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఆ వివరాలు...

జీజీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం చివరి సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లు నెట్ రాసుకోవచ్చు. పరీక్షను 83 సబ్జెక్టులు/విభాగాల్లో దేశవ్యాప్తంగా 398 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. భాషలు తప్పించి, మిగిలిన సబ్జెక్టుల్లో పరీక్షలు రాయడానికి ఇంగ్లిష్, హిందీ మాధ్యమాలను ఎంచుకోవచ్చు.

- నెట్‌లో అర్హత పొందినవారు తమ స్కోరును బోధన రంగంలో పాస్‌పోర్టులా ఉపయోగించుకోవచ్చు.
- డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థలు ఎక్కువ స్కోరు సాధించినవారికి అధిక వేతనంతో ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయి.
- శిక్షణ సంస్థల్లోనూ నెట్ అర్హులకు ప్రాధాన్యం ఉంది.
- ఎస్సీ, ఓబీసీ విభాగాల్లో నేషనల్ ఫెలోషిప్పులు పొందడానికి నెట్ తప్పనిసరి. ఈ దఫా నెట్‌లో కొత్తగా ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సబ్జెక్టు ప్రవేశపెట్టారు.

సన్నద్ధత ఎలా?

- సబ్జెక్టుపై మీకెంత పట్టు ఉందో తెలుసుకునేలా ప్రశ్నలుంటాయి.
- రెండు, మూడు అంశాలను కలిపి ఒకే ప్రశ్నగా రూపొందిస్తారు. ప్రాథమికాంశాలపై పూర్తి అవగాహన ఉన్నవారే ఇలాంటి వాటికి సమాధానం గుర్తించగలరు.
- ముందుగా డిగ్రీ పాఠ్యాంశాలను విస్తృతంగా చదవాలి. ఏవైనా చాప్టర్లు అర్థం చేసుకోవడంలో ఇబ్బందిగా అనిపిస్తే వాటిని ఇంటర్మీడియట్ స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ పుస్తకాలు బాగా చదవడం పూర్తయ్యాకే పీజీ పాఠ్యాంశాల్లోకి వెళ్లాలి.
- అకడమిక్‌తోపాటు రిఫరెన్స్ పుస్తకాలూ అవసరమవుతాయి. అయితే వాటిని పరిమితంగానే ఎంచుకుని, బాగా చదవాలి. ఒకే అంశంలో ఎక్కువ పుస్తకాలు అధ్యయనం వల్ల సమయం సరిపోదు. ఆశించిన ప్రయోజనమూ దక్కదు.
- చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలను నోట్సు రాసుకోవాలి. పరీక్షకు ముందు వీటిని మరోసారి శ్రద్ధగా గమనించాలి.
- పాత ప్రశ్నపత్రాలు నిశితంగా గమనించాలి. ప్రశ్నలడిగే విధానం, వాటి స్థాయి, అంశాలవారీ లభిస్తోన్న ప్రాధాన్యం పరిశీలించి, సన్నద్ధతలో అవసరమైన మార్పులు చేసుకోవాలి.
- ఎలాంటి ప్రశ్న వచ్చినా ఎదుర్కోగలిగే స్థాయిలో అధ్యయనం ఉండాలి.
- రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సెట్/స్లెట్ పేపర్లూ పరిశీలించవచ్చు. జేఎల్, డీఎల్ ప్రశ్నపత్రాలూ ఉపయోగపడతాయి. పీజీ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల అధ్యయనమూ మేలు చేస్తుంది.
- సన్నద్ధత పూర్తయిన తర్వాత కనీసం పది మాక్ టెస్టులు రాయాలి. ఇందులో సాధించిన స్కోరు గమనించాలి. ఏ చాప్టర్లు/విభాగాల్లో తప్పులొస్తున్నాయో తెలుసుకుని వాటిని మరింత శ్రద్ధగా చదవాలి. ఇదే పద్ధతిని చివరిదాకా కొనసాగిస్తే అభ్యాసం సరైన దిశగా వెళ్తున్నట్లు భావించవచ్చు. పరీక్షలో విజయవంతం కావడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.
- రుణాత్మక మార్కులు లేవు కాబట్టి బాగా ఆలోచించి తెలియని ప్రశ్నలకూ జవాబులు గుర్తించవచ్చు.
- ఏదైనా ప్రశ్నకు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలున్నా, ప్రశ్నలో ఏమైనా పొరపాట్లు ఉన్నా బోనస్ మార్కులు ఇస్తారు. అయితే ఆ ప్రశ్నకు ఏదో ఒక ఆప్షన్ జవాబుగా గుర్తించినవారికే ఇవి దక్కుతాయి. ఏ సమాధానమూ ఇవ్వనివారికి ఈ మార్కులు జతచేయరు. అందువల్ల తెలియని ప్రశ్నలకూ ఏదో ఒక ఆప్షన్ సమాధానంగా ఇవ్వాలి.

ఏ పుస్తకాలు?

ట్రూమెన్స్/అరిహంత్/ఉప్‌కార్/ టాటా మెక్‌గ్రా హిల్స్/ పియర్సన్ వీటిలో ఏదైనా ఒకటి లేదా రెండు పుస్తకాలు తీసుకోవచ్చు.

పరీక్ష ఇలా...

ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. వీటికి 300 మార్కులు. 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ రెండు మార్కులు. పేపర్ 1 అభ్యర్థులందరికీ ఉమ్మడిగా ఉంటుంది. 50 ప్రశ్నలకు వంద మార్కులు. రెండో పేపర్ వంద ప్రశ్నలు 200 మార్కులకు నిర్వహిస్తారు. ఈ ప్రశ్నపత్రం అభ్యర్థి ఎంపిక చేసుకున్న విభాగం/సబ్జెక్టు నుంచి ఉంటుంది. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పేపర్ 1, 2 మధ్య విరామం లేదు. పరీక్షను విడతలవారీ వివిధ తేదీలు, సమయాల్లో నిర్వహిస్తారు.

పేపర్ 1: ఇందులో 10 విభాగాలు ఉంటాయి. అవి..టీచింగ్ ఆప్టిట్యూడ్, రిసెర్చ్ ఆప్టిట్యూడ్, కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, మ్యాథమెటికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), పీపుల్, డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టం. అభ్యర్థి బోధన, పరిశోధన రంగంలో రాణించగలరా, లేదా తెలుసుకునేలా ప్రశ్నలు రూపొందిస్తారు. ఆలోచన విధానం, అంగ్లాన్ని అర్థం చేసుకునే తీరు, గణితంలో ప్రాథమిక పరిజ్ఞానం, తర్కం, విశ్లేషణ సామర్థ్యం, కమ్యూనికేషన్ సాధనాలు, అభివృద్ధి, పర్యావరణం, ఉన్నత విద్యలకు సంబంధించిన సాధారణ స్థాయి ప్రశ్నలే వస్తాయి.

పేపర్-2: ఇందులో మొత్తం సబ్జెక్టు ప్రశ్నలే ఉంటాయి. అభ్యర్థి ఎంచుకున్న విభాగంలో.. ప్రాథమికాంశాలు, అనువర్తనం, విశ్లేషణ, అవగాహన, జ్ఞానం పరిశీలించేలా వీటిని అడుగుతారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉన్నప్పటికీ ప్రతి అంశాన్నీ విస్తృతంగా, సూక్ష్మంగా చదివితేనే సమాధానం గుర్తించగలరు. యూజీసీ వెబ్‌సైట్‌లో సబ్జెక్టులవారీ సిలబస్ వివరాలు పేర్కొన్నారు. వాటిని ప్రామాణికంగా తీసుకోవాలి.

అర్హత పొందితే...

జాతీయ అర్హత పరీక్ష (నెట్)లో నెగ్గితే దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఆర్ఎఫ్ అర్హులు మేటి సంస్థల్లో పరిశోధన (పీహెచ్‌డీ) దిశగా అడుగు లేయవచ్చు. వీరికి మొదటి రెండేళ్లలో ప్రతి నెలా రూ.31,000 చెల్లిస్తారు. అనంతరం ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత సాధిస్తే రూ.35,000 చొప్పున స్టైపెండ్ అందుతుంది. సంబంధిత సంస్థ వసతి కల్పించకపోతే స్టైపెండ్‌లో 30 శాతం వరకు హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ఏటా కంటింజెన్సీ గ్రాంటు అందుతుంది. ఇటీవలికాలంలో కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు (మహారత్న, నవరత్న కంపెనీలు) నెట్ స్కోర్‌తో మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో లీగల్, హ్యూమన్ రిసోర్సెస్, మార్కెటింగ్ తదితర విభాగాల్లో ఉద్యోగాలు అందిస్తున్నాయి. ప్రైవేటు సంస్థలు సైతం నెట్ అర్హులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నాయి.

కటాఫ్

సబ్జెక్టు బట్టి మారుతుంది. ఆ సబ్జెక్టులో పరీక్ష రాసినవారి సంఖ్య, ప్రశ్నపత్ర కఠినత్వం ప్రకారం ఈ మార్పులు ఉంటాయి. లెక్చరర్‌షిప్ అయితే ఏ సబ్జెక్టు అయినప్పటికీ అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు 200 మార్కులు పొందితే సరిపోతుంది. అదే జేఆర్ఎఫ్ కోసమైతే 220 వరకు రావాలి. కొన్ని సబ్జెక్టుల్లో లెక్చరర్‌షిప్ 180 మార్కులకే పొందవచ్చు. జేఆర్ఎఫ్ 200కే లభిస్తోంది.

ఇవి గమనించండి

విద్యార్హత: సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం పీజీ కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: జేఆర్ఎఫ్ కోసం ఫిబ్రవరి 1, 2023 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, మహిళలకు గరిష్ఠ వయసులో ఐదేళ్ల సడలింపులు వర్తిస్తాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పొందడానికి వయసు నిబంధన లేదు. విద్యార్హతలున్న ఎవరైనా రాసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 17 సాయంత్రం 5 వరకు.
దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1100. ఓబీసీ(నాన్ క్రీమీ లేయర్), ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈబీసీ)కు రూ.550; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు రూ.275.
పరీక్షలు: ఫిబ్రవరి 21 నుంచి మార్చి 10 వరకు.
వెబ్‌సైట్: https://ugcnet.nta.nic.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో...

యాప్ డెవలప్‌మెంట్
సంస్థ: మేగ్నిఫై ఐటీ
ప్రదేశం: కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, విశాఖపట్నం
స్టైపెండ్: నెలకు రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: 09.01.2023
అర్హతలు: ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, ఐఓఎస్, జావా, కాట్లిన్, రియక్ట్ నేటివ్, రెస్ట్ ఏపీఐ నైపుణ్యాలు
internshala.com/i/52e66c

అడ్మినిస్ట్రేషన్
సంస్థ: ఓఎఫ్ఎస్ఏ ఐటీ సొల్యూషన్స్
ప్రదేశం: విశాఖపట్నం
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: 10.01.2023
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
internshala.com/i/ce94cf

కంటెంట్ రైటింగ్
సంస్థ: కెరియర్స్360 **స్టైపెండ్:** నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: 09.01.2023 **అర్హతలు:** క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/8e5d75

ఈవీ మార్కెటింగ్
సంస్థ: రామ్ గ్రూప్ **స్టైపెండ్:** నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: 10.01.2023
అర్హతలు: ఈవీ మార్కెటింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు internshala.com/i/7aadb1

మార్కెటింగ్ అండ్ ఆపరేషన్స్
సంస్థ: మెసా ప్లాట్‌ఫామ్స్
స్టైపెండ్: నెలకు రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: 12.01.2023
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
internshala.com/i/9dbf12

నోటిఫికేషన్స్ ప్రభుత్వ ఉద్యోగాలు

275 జూనియర్ అసిస్టెంట్‌లు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో 275 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసింది.
అర్హత: బ్యాచిలర్ డిగ్రీ. కంప్యూటర్ పరిజ్ఞానం లేదా కంప్యూటర్ ఆపరేషన్ అర్హతతో పాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి.
వయసు: 01-07-2022 నాటికి 18 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: సీబీటీ/ ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా.
దరఖాస్తు రుసుం: ఓసీ/ ఓబీసీ అభ్యర్థులకు రూ.600 (ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400).
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 11-01-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-01-2023.
కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ: మార్చి 2023.
వెబ్‌సైట్: https://tshc.gov.in/getRecruitDetails

రికార్డు అసిస్టెంట్ కొలువులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో 97 రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసింది.
అర్హత: ఇంటర్మీడియట్. నిర్ణీత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ ఉన్న అభ్యర్థులు, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో పత్రాలను అందజేయాలి.
వయసు: 01-07-2022 నాటికి 18 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు; దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
ఎంపిక: సీబీటీ/ ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా.
దరఖాస్తు రుసుం: ఓసీ/ ఓబీసీ అభ్యర్థులకు రూ.600 (ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400).
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 11-01-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-01-2023.
కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ: మార్చి 2023.
వెబ్‌సైట్: https://tshc.gov.in/getRecruitDetails

ప్రాసెస్ సర్వర్ పోస్టులు

163 ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసింది.
అర్హత: పదో తరగతి. అభ్యర్థులు దరఖాస్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను పేర్కొనడంతో పాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి. **వయసు:** 01-07-2022 నాటికి 18 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** సీబీటీ/ ఓఎమ్మార్ పరీక్ష(45 మార్కులు), ఇంటర్వ్యూ(5 మార్కులు) ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 11-01-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-01-2023.
వెబ్‌సైట్: https://tshc.gov.in/getRecruitDetails